శరవేగంగా డబుల్ రోడ్డు పనులు


జానకంపేట్ - వేల్పూర్ మార్గంలో సాగుతున్న డబుల్ రోడ్డు పనులు

వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్ నుంచి వేల్పూర్ వైపు డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వేల్పూర్ మండల కేంద్రం నుంచి సాహెబ్‌పేట్, జాన్కంపేట్ మీదుగా జక్రాన్‌పల్లి మండలం తొర్లికొండ, బ్రాహ్మన్‌పల్లి గ్రామాలను కలుపుతూ జాతీయ రహదారి 44 వరకు డబుల్‌రోడ్డు నిర్మాణానికి రూ. 21 కోట్లు మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేయించారు. 44 నంబరు జాతీయ రహదారి నుంచి జాన్కంపేట్ వరకు, వేల్పూర్ నుంచి సాహెబ్‌పేట్ వరకు ఎన్నికలకు ముందే డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తయింది. జాన్కంపేట్, సాహెబ్‌పేట్ గ్రామాల మధ్య పంట పొలాలు ఉండడం, జూలైలో కురిసిన వర్షం, వచ్చిన వరదలకు రహదారి ధ్వంసం కావడం, అంతలోనే ఎన్నికలు రావడంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం పంటపొలాల నూర్పిడి పూర్తికావడంతో పనులు జోరందుకున్నాయి. రోడ్డు పనులు పూర్తయితే వేల్పూర్ వరకు, 44 నంబరు జాతీయ రహదారి వరకు డబుల్‌రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది. అంతేగాక ఆర్మూర్, భీమ్‌గల్ ప్రధాన రహదారిపై ఉన్న జాన్కంపేట్‌కు నాలుగు దిక్కులా డబుల్‌రోడ్డు సౌకర్యం కలుగుతుంది. పనులు జోరందుకోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాతీర్పును గౌరవిస్తాం

- అతి విశ్వాసంతోనే ఓటమి
- బోధన్ తాజా మాజీ ఎమ్మెల్యే షకీల్


బోధన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

బోధన్: ప్రజాస్వామ్య వ్యవస్థలో జరిగే ఎన్నికల్లో ప్రజా తీర్పు ఎంతో గొప్పదని, ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని బోధన్ తాజా మాజీ ఎమ్మెల్యే (బీఆర్ఎస్ అభ్యర్థి) షకీల్ అన్నారు. ప్రజలు తమ వైపు ఉన్నారనే అతి విశ్వాసంతో ఎన్నికల్లో ముందుకెళ్లామని, పార్టీ కార్యకర్తల తప్పేమి లేదని, కానీ ప్రజలు మార్పు కోరుకున్నందున అనుహ్య ఫలితాలు వచ్చాయన్నారు. తన గెలుపు కోసం కార్యకర్తలు ధైర్యంతో పని చేశారని, వారికి అండగా ఉంటానన్నారు. పదేళ్లు అధికారం ఇచ్చిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని అప్నా ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో షకీల్ మాట్లాడుతూ..

ఎన్నికల్లో ప్రాంతీయ, మత రాజకీయాలు ప్రత్యర్థి పార్టీలే చేశాయన్నారు. పార్టీలో కొందరు అధికారం, పదవులు అనుభవించి మోసం చేసి వెళ్లారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు అధికారం ఇచ్చిన ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పని చేయాలని, తమ పార్టీ కార్యకర్తలపై దౌర్జన్యం, దాడులకు పాల్పడితే ఊరుకోబోమన్నారు. తెలంగాణలో వచ్చేది టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పాలన కాదని, చంద్రబాబు పాలన వస్తోందని వ్యాఖ్యానించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితయాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, సంజీవ్‌కుమార్, నర్సింగ్‌రావు, దేరడి శ్రీరాం పాల్గొన్నారు.

బీజేపీని ప్రజలు ఆదరించారు


బోధన్‌లో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల వలే డబ్బు, మద్యం పంచకపోయిన ధర్మాన్ని నమ్ముకొని ప్రజల వద్దకు వెళ్లిన భారతీయ జనతా పార్టీని ప్రజలు ఆదరించారని పార్టీ అభ్యర్థి వడ్డి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ విజయం కోసం ప్రతీ ఒక్కరు పనిచేశారని, పస్తులు ఉండి పనిచేసిన నాయకులకు, కార్యాకర్తలకు పాదాభివందనాలు అన్నారు. రాబోవు స్థానిక, ఎంపీ ఎన్నికల్లో బరిలో నిలిచి పోరాడి విజయం సాధించే దిశగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను విస్మరించడంతో ఆ పార్టీని ప్రజలు రాష్ట్రంలో, బోధన్ నియోజకవర్గంలో ఓడించారని వెల్లడించారు. ఆరు గ్యారంటీ పథకాలతో ముందుకు వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారన్నారు. బీజేపీని నమ్మి నియోజకవర్గంలో 33వేల పైచిలుకు ఓట్లు వేసి అక్కున చేర్చుకున్నారని పేర్కొన్నారు. సుధర్శన్‌రెడ్డి పట్టణంలో సొంత ఇల్లు ఏర్పాటుచేసి ప్రజల సమస్యలు తీర్చడానికి కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు అడ్లూరి శ్రీనివాస్, మాసిని వినోద్, శ్రీధర్, ఇంద్రకరణ్, ప్రవీణ్, మేక విజయ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


జక్కుల అద్రిజ

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లోని సేయింట్ ఆన్స్ పాఠశాల స్కూల్ విద్యార్థులు జక్కుల అద్రిజ, వేదాన్ష్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుమలత తెలిపారు. జిల్లా కేంద్రంలో సోమవారం ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అండర్-14 బాలబాలికల పోటీలు నిర్వహించారు. పోటీల్లో అద్రిజ, వేదాన్ష్ అద్భుత ప్రతిభతో రాష్ట్ర స్థాయికి ఎంపికై నట్లు తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను, కోచ్ వంశీకృష్ణను హెచ్‌ఎం అభినందించారు.

భూసారాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న శాస్త్రవేత్త కృష్ణ చైతన్య

బోధన్: మానవాళి మనుగడకు మూలాధారమైన భూమిని, భూసారాన్ని కాపాడుకోవాలని రుద్రూర్ ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన కేంద్రం మృతిక శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ చైతన్య సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, అవసరం మేరకే రసాయనిక మందుల వాడకం ఉండాలన్నారు. మండలంలోని హున్సా జెడ్పీహెచ్‌ఎస్‌లో ప్రపంచ నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూమి కలుషితం కాకుండా రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. నేల ఏర్పడే విధానం, నేల కోత నివారణకు క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కీటక శాస్త్రవేత్త సాయిచరణ్, హెచ్‌ఎం నగేష్, ఎస్‌ఎంసీ చైర్మన్ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘మున్సిపల్’ అవినీతిపై విచారణ జరిపించాలి


ఆర్మూర్‌లో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జీవీ నర్సింహరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ఆర్మూర్‌లోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా నర్సింహరెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్మన్, అధికారులు కుమ్మక్కై పెర్కిట్, మామిడిపల్లి పరిధిలోని ప్రభుత్వ భూములు, ఇరిగేషన్ భూములకు అక్రమంగా ఇంటి నెంబర్లు కేటాయిస్తూ లక్షలు దండుకున్నారని ఆరోపించారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టి మున్సిపల్‌లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నాయకులు ద్యాగ ఉదయ్, యామాద్రి భాస్కర్, నూతుల శ్రీనివాస్ రెడ్డి, పోల్కం వేణు, భరత్, పీర్‌సింగ్, లింగన్న, పాన్ శ్రీను, గాండ్ల సాగర్, నర్సా రెడ్డి, వాసు, దక్షిణమూర్తి, నవీన్ రాజేశ్వర్, కార్తీక్ సింగ్, కౌన్సిలర్లు సాయి, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

- సీడీపీవో జానకమ్మ
- విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన


బోధన్‌లో మాట్లాడుతున్న సీడీపీవో జానకమ్మ

బోధన్: బాలల హక్కులను కాపాడే బాధ్యత మనందరిపై ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ జానకమ్మ అన్నారు. నేటి బాలలే రేపటి భావి భారత పౌరులనే విషయం గమనించాలని పేర్కొన్నారు. ప్రపంచ బాలల హక్కుల వారోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం పట్టణంలోని బీటీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో బాలల హక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చట్టబద్ధంగా కల్పించిన బాలల హక్కులను విద్యార్థులకు వివరించారు. బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా జరుగకుండా చూడటం బాధ్యతగా గుర్తించాలని కోరారు. పిల్లలకు సంబంధించిన సమస్యలుంటే 1098 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. బాలల పరిరక్షణ అధికారి నాగేపల్లి బాబు, స్వప్న, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక రాథోడ్, ఆసియాబేగం, గంగవేణి, సౌజన్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..


ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని, ఎవరైన బాల్య వివాహాలను చేసినట్లెతై చట్టపర చర్యలు తప్పవని మహిళ శిశుసంక్షేమ శాఖ సీడీపీవో భార్గవి అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ రాంమందిర్ పాఠశాలలో మంగళవారం బాలల హక్కులు, బాల్యవివాహ నిరోధకచట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యార్థులు బాగ చదివి ఉన్నతంగా ఎదగాలన్నారు. బాలల హక్కుల గురించి విద్యార్థులకు వివరించారు. అధికారులు జ్యోతి, నళిని, పుష్ప, కవిత, బీకేసింగ్, షీటీమ్ సభ్యులు విష్ణుష్ తదితరులు పాల్గొన్నారు.

కమలం వైపే డొంకేశ్వర్

- మండలంలోని అన్ని గ్రామాల్లో మెజార్టీ ఓట్లు బీజేపీకే



డొంకేశ్వర్(ఆర్మూర్): అసెంబ్లీ ఎన్నికల్లో డొంకేశ్వర్ మండల ప్రజలు కమలం వైపు మొగ్గు చూపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో బీజేపీకి మెజార్టీ ఓట్లు వచ్చాయి. ప్రధానంగా మండల కేంద్రంలోనే అత్యధిక ఓటర్లు ‘పువ్వు’ గుర్తుకు ఓటేయడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు విస్మయానికి గురవుతున్నారు. బలంగా ఉన్న గ్రామాల్లో సైతం ‘కారు’ డీలా పడిపోయింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా పోటీ చేసిన జీవన్‌రెడ్డి అత్తగారి ఊరు మారంపల్లిలో సైతం బీజేపీ గట్టి పోటీనిచ్చింది. ఇక్కడ రెండు పోలింగ్ బూత్‌లు కలిపి బీఆర్ఎస్‌కు 597 ఓట్లు రాగా, బీజేపీకి 533 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్‌కు 215 వచ్చాయి. అలాగే డొంకేశ్వర్ మండల కేంద్రంలో ‘కారు’కు గట్టి దెబ్బ తగిలింది. ఇక్కడ మొత్తం మూడు పోలింగ్ బూత్‌లు ఉండగా, బీఆర్ఎస్‌కు 606 ఓట్లు రాగా, బీజేపీకి రెట్టింపు ఓట్లు 1,205 రావడం గమనార్హం. కాంగ్రెస్‌కు 486 ఓట్లు వచ్చాయి. అదే విధంగా దత్తాపూర్, తొండాకూర్, నడ్కుడ, నికాల్‌పూర్ గ్రామాల్లో సైతం బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ కంటే తక్కువగా ఓట్లు వచ్చాయి. నూత్‌పల్లి ప్రజలు కూడా బీజేపీకే జై కొట్టారు. డొంకేశ్వర్ మండల వ్యాప్తంగా ‘కారు’కు గణనీయంగా ఓట్లు తగ్గడం, బీజేపీ భారీగా పుంజుకోవడంపై బీఆర్ఎస్ నాయకులంతా బూత్ వారీగా పోస్టుమార్టం చేస్తున్నారు.

పోలైన ఓట్లు 13,526...

డొంకేశ్వర్ మండలం పరిధిలో 12 గ్రామాల్లో మొత్తం 19 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. ఓటర్లు మొత్తం 16,279 మంది ఉండగా, మహిళలు 8,760, పురుషులు 7,518, ఇతరులు ఒక్కరు ఉన్నారు. ఐతే, పోలింగ్ రోజున మండల వ్యాప్తంగా 13,526 (82.20శాతం) ఓట్లు పోల్ అవగా, ఇందులో 7,854 మంది మహిళలు, 5,672 మంది పురుషులున్నారు. మండలంలో బీఆర్ఎస్‌కు 3,401, బీజేపీకి 5,949, కాంగ్రెస్‌కు 3,238 ఓట్లు వచ్చాయి.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు


దొన్కల్ గ్రామంలో..


కమ్మర్‌పల్లిలో పటాకులు కాల్చుతున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి/మోర్తాడ్: కమ్మర్‌పల్లి, మోర్తాడ్ మండలాల్లో మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డిని పార్టీ అధిష్టానం సీఎం అభ్యర్థిగా ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. పటాకులు కాల్చి, స్వీట్స్ తినిపించుకున్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పటిష్టమైన నాయకుడిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఎంపిక చేసిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా హామీ ఇచ్చినా ఆరోగ్యానికి కచ్చితంగా అమలు చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు సుంకట రవి, నిమ్మ రాజేంద్రప్రసాద్, నూకల బుచ్చి మల్లయ్య, సాలూరు గణేష్ గౌడ్, సుంకరి రాజేశ్వర్, సింగిరెడ్డి శేఖర్, గణేష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాన్ని తొలగించాలి


ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వార్డు సభ్యురాలు శోభ

నవీపేట: మండల కేంద్రంలోని బాసర రహదారి పక్కన ఇరిగేషన్ స్థలంలో అక్రమ నిర్మాణం చేపట్టారని, వెంటనే తొలగించాలని వార్డు సభ్యురాలు గొల్ల శోభ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం ఆమె ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అధికారులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న కబ్జాదారులు నిర్మాణం చేపట్టారని ఆమె పేర్కొన్నారు. అధికారులు చర్యలు తీసుకునే వరకు నిరసనను విరమించనన్నారు. దీంతో ఇరిగేషన్ డీఈఈ బలరామ్, ఏఈ శ్రీధర్‌లు అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. తొలగించాలని సంబంధిత కుటుంబ సభ్యులకు తెలుపగా నిరాకరించారు. ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిర్ణీత గడువులో నిర్మాణాన్ని తొలగించాలని అధికారులు నిర్మాణానికి నోటీసులు అంటించారు. తొలగించకపోతే కూల్చేస్తామని హెచ్చరించారు.

పీజీలో ఖాళీ సీట్లను భర్తీ చేయాలి


తెయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పీజీ సీట్లను వెంటనే భర్తీ చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. మంగళవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆయన వర్సిటీ పరిపాలనా భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం క్యాంపస్ పీజీ అడ్మిషన్లలో అన్ని కోర్సులలో కలిపి సుమారు 200 సీట్లు మిగిలిపోయాయన్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్పాట్ అడ్మిషన్స్ ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేయాలని కోరారు. నాయకులు శివసాయి, ఆకాష్, హన్మాండ్లు, అశ్విత్, తరుణ్, రాము, రాజు, మన్యంకొండ పాల్గొన్నారు.

నేడు ఆరట్టు మహోత్సవం

బోధన్: పట్టణంలోని భీమునిగుట్టపైగల అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం ట్రస్ట్ అధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆరట్టు మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శివన్నారాయణ, కార్యదర్శి ఐఆర్ చక్రవర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామి వారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. దీక్షా స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలి

ఇందల్వాయి: ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని, గర్భిణులు తమ పేర్లను ఆరోగ్యకేంద్రాల్లో నమోదు చేసుకునేలా కృషి చేయాలని ఆరోగ్య సిబ్బందికి హెచ్ఈవో శంకర్, వైద్యుడు సంతోష్ సూచించారు. ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వారు ఆరోగ్య సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. చలికాలంలో సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సిబ్బంది అక్బర్ అలీ, వెంకట్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఘంటసాల జయంతి



నిజామాబాద్ సిటీ: తెలుగు జాతి స్వరపుత్రుడిగా ఎనలేని సినీ లలిత సంగీత సేవలందించిన ఘంటసాల జయంతిని మంగళవారం నగరంలో తెలుగు వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఘంటసాల ప్రత్యేక సంగీత విభావరికి, ప్రముఖ కథా రచయిత దారం గంగాధర్ ముఖ్యఅతిథిగా, అష్టావధాని గణపతి అశోక్ శర్మ, విశిష్ట అతిథి కవి విపి చందన్‌రావు సభకు అధ్యక్షత వహించారు. సంస్థ కార్యదర్శి బి చంద్రశేఖర్ ఘంటసాల ప్రతిభా విశేషాలను వివరించారు. పలువురు గాయకులను సన్మానించారు. అయాచితం నాగరాజశర్మ, వేముల శేఖర్, రామ సూర్యప్రకాశ్‌రావు, సముద్రాల రాములు, నరసింహం, రాజేశ్వర్‌రావు, ప్రభాకర్‌రావు, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



ఆర్మూర్‌టౌన్: పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతి మంగళవారం నిర్వహించే ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా అర్హులైన గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భవతులకు పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. మహిళలు ఆరోగ్య పరీక్షలను ఎప్పటికప్పుడు చేసుకోవాలని సూచించారు. గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ ఫాతిమా, కృష్ణమూర్తి, ఆండ్రూస్, సాయి, చంద్రశేఖర్, స్వరూప, రజిత, సంధ్య ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయంలో కాంగ్రెస్ నేతల పూజలు



ఎడపల్లి(బోధన్): మండలంలోని పోచారం గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ నాయకులు పోచమ్మ తల్లి ఆలయంలో నూటొక్క కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందితే నూటొక్క కొబ్బరి కాయలు కొడతామని గ్రామ కాంగ్రెస్ నాయకులు గతంలో మొక్కుకున్నారు. దీంతో ఇటీవల ప్రకటించిన ఎన్నికల ఫలితాల్లో సుదర్శన్‌రెడ్డి గెలవడంతో పార్టీ సీనియర్ నాయకుడు రవికుమార్ పోచమ్మ తల్లి ఆలయంలో 101కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పులి శ్రీనివాస్, విజయ్‌గౌడ్, నీరడీ రవికుమార్, రెడ్డి సాయన్న సుంకర సుదర్శన్, జక్కు సాయన్న, గోవింద్ రెడ్డి, కట్ట లక్ష్మయ్య, కట్ట సాయిలు కోల విజయ చందర్, కుమార్ పాల్గొన్నారు.

కొండగట్టులో బీఆర్ఎస్ నేతలు..



వేల్పూర్: బాల్కొండ ఎమ్మెల్యేగా వేముల ప్రశాంత్‌రెడ్డి మూడోసారి విజయం సాధించడంతో వేల్పూర్ బీఆర్ఎస్ నాయకులు రేగుల్ల రాములు, బబ్బూరు ప్రతాప్‌రెడ్డి మంగళవారం కొండగట్టు ఆంజనేయస్వామికి మొక్కు చెల్లించుకున్నారు. గత నెల 30న జరిగిన అసెంబ్లీ సాధారణ ఎన్నికల్లో ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించాలని ఈనెల 1న కొండగట్టు ఆలయంలో మొక్కుకున్నారు. ప్రశాంత్‌రెడ్డి విజయం సాధించడంతో మొక్కు చెల్లించుకున్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో మంగళవారం కుర్చీలను వితరణ చేశారు. క్లబ్ అధ్యక్షుడు పట్వారి తులసి కుమార్, కోశాధికారి లక్ష్మీనారాయణ, ప్రాజెక్టు చైర్మన్ కోట నరేష్, సభ్యులు శశిధర్, ఉపాధ్యాయులు కిషన్, అనిల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మగ్గిడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి బీచ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం హరిత తెలిపారు. ఈసందర్భంగా మంగళవారం విద్యార్థులను, పీఈటీ మధును హెచ్‌ఎం హరిత, సర్పంచ్ సుమలత అభినందించారు. జక్రాన్‌పల్లి మండలం కలిగోట్ గ్రామంలో ఇటీవల ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో అండర్-14 విభాగంలో బాలురు, అండర్-17 విభాగంలో బాలికలు ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 8నుంచి మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – సామ్ బహదూర్ (హిందీ)- 03.00, 10.10; యానిమల్ (తెలుగు)-6.10
స్క్రీన్-2 – యానిమల్ (తెలుగు)- 09.00, 1.00, 5.00, 9.00
స్క్రీన్-3 – యానిమల్ (తెలుగు)- 10.00, 2.00, 6.00, 10.10; మంగళవారం (తెలుగు)- 4.00
స్క్రీన్-4 – కాలింగ్ సహస్ర (తెలుగు)- 01.15, ఉపేంద్రగాడి అడ్డా (తెలుగు) 4.20, అథర్వ (తెలుగు) - 7.10, విక్రమ్‌రాథోడ్ (తెలుగు) 9.45